# శీర్షాసనం

శశిమూరి శ్రీనివాస్

రాంబాబు వారం నుంచి ఆ సమస్యలో ఇరుక్కుని శ్లేష్మంలో పడ్డ ఈగలా గిలగిలాడుతున్నాడు. 'ఏదో ఒకటి చెయ్యాలి... ఈ సంఘానికి తోచిన ఉపకారం చేయాలి. కళ్ళు మూసినా, తెరిచినా ఇదే మధన. ఏం చేయాలోమళ్ళీ సందిగ్ధం. డబ్బు, అధికారం లేకుండా ఏం చేయాలో తోచలేదు.



ఈ ఊగిసలాట స్థితిలో ఉన్నప్పుడే కాస్త ఒత్తిడి తగ్గించుకుందామని ధ్యానం చేసి శవాసనం వేశాడు.

''ఏమండీ... ఎంత పని చేశారండి ఆస్తిపాస్తులు, అప్పులు చెప్పకుండానే బాల్చీతన్ని సిగ్నల్ ఇవ్వకుండానే వెళ్ళారా! ఓరి దేవుడో, నా గతేం కాను...'' భార్య గజిని ఏడుపులతో తగ్గిన ఒత్తిడి కాస్తా తిరిగి మొదటి కొచ్చి దిగ్గున లేచి కూర్చున్నాడు.

''నీ పెడబొబ్బలు ఆపుతావా...నేనెక్కడికీపో లేదు. శవాసనం వేశానంతే''

''శవాసనమా...అదేంటండీ?'' మళ్ళీ ఘొల్లుమంది గజిని.

''నీ మతిమరుపుతో నా చావు కొస్తోంది. మీ నాన్న 'గజిని' అని ఏమంటూ పేరు పెట్టాడోగాని చక్కగా సరిపోయింది. పది నిమిషాల క్రిందట విషయాలు కూడా గుర్తుండవు. నా ఖర్మేంటో నన్ను మాత్రం పర్మినెంట్‌గా గుర్తుంచుకున్నావు. అది సరే నేను యోగా, ధ్యానం చేస్తానని తెలుసుగా?''

''ఆ.... ఏదో కొంచెం కొంచెం మసక మసగ్గా గుర్తుకొస్తోంది''. పాలు పొంగిన వాసన రావడంతో స్టవ్ మీద పాలు పెట్టానన్న విషయం గుర్తొచ్చి లోపలికి వెళ్ళింది.

తనతో రోజూ ఉండే అమోమయమే కాబట్టి రాంబాబుకు భార్య గురించిన ఆలోచన లేదు. తన బాహ్యదృష్టి, అంతర్దృష్టి అంతా తనుచేయాలనుకున్న సంఘసేవ పైనే.

వార్తలు వీక్షిద్దామని టి.వి. ఆన్ చేశాడు. రాంబాబుకు అందరి ఇండ్లల్లో లాగా సీరియళ్ళ గొడవలేదు, చర్చ అంతకన్నా లేదు. ఎందుకంటే, గజినికి గతం గుర్తుండదు కదా. సీరియళ్ళలోని ఏ భాగాన్ని ఎప్పుడు చూసినా 'ఫ్రెష్' గా ఫీలవుతుంది. ఈ విషయంలో మాత్రమే గజినిని చూసి రాంబాబు సంతోషిస్తూ ఉంటాడు.

వార్తలు వస్తున్నాయి. ఆసక్తిగా తిలకిస్తున్న రాంబాబును, ఓ వార్త గుండెను మెలిపెట్టేలా చేసింది. అది 'ఖైదీల స్థితిగతులపై రిపోర్ట్'. ఒంటర్లై, కుటుంబానికి దూరమై, చిక్కి శల్యమై, జీవచ్ఛవమై ఉన్న ఆ అభాగ్యులు శారీరక బలహీనతలతో పాటు మానసికంగా క్రుంగి పోతున్నారన్న బాధ నిలువెల్లా కమ్మేసింది. ముఖమంతా ఎర్రగా మారింది.

ఖైదీ సోదరులందరికీ తన వంతు సహాయం చేయాలనుకున్నాడు రాంబాబు.

ఎంతో ఆలోచించాక వారిని శాశ్వతంగా మార్చివేసే పని చేయాలనుకున్నాడు. ''నాకు తెలిసిన యోగా, ధ్యానాలను ఖైదీలకు నేర్పితే చాలు! జీవితాంతం గుర్తుంచుకుంటారు''. ఆలోచన సుడులు తిరిగింది. ఖైదీలను ఆ విద్యల్లో నిష్ణాతులు చేయాలని కంకణం కట్టుకున్నాడు.

నిశ్చయించుకోవడం బాగానే ఉన్నా...ఖైదీలకు నేర్పాలంటే ఎవరి అనుమతి తీసుకోవాలో, అసలు అనుమతిస్తారో లేదో తెలియదు.

ఆలోచనలో మునిగి రాంబాబు మెదడులో ముక్కంటి చిత్రం ఫ్లాషయింది. ముఖంలో సంతృప్తి తొణికిసలాడింది. రాంబాబుకు ముక్కంటి మంచి స్నేహితుడు. తను ప్రభుత్వోద్యోగిగా, ముక్కంటి నిరుద్యోగిగా ఒకేసారి హైదరాబాద్ వచ్చారు. ఒక జతబట్టలు, ఓ చేతి సంచీతో వచ్చిన ముక్కంటి ఈ రోజు ఏ స్థాయిలో ఉన్నాడో తలుచుకుంటేనే రాంబాబుకు గగుర్పాటు కలుగుతుంది. ముక్కంటి చేయని వ్యాపారాలు లేవు. ప్రస్తుతానికి రియల్ ఏస్టేట్ లో చక్రం తిప్పుతున్నాడు.

ముక్కంటికి ఫోన్ చేశాడు. ఓ పదిసార్లు 'నెంబర్ బిజీ' అని వచ్చాక మాత్రమే లైన్ కలిసింది. 'బిజీగా ఉండేవాళ్ళ ఫోన్లు కూడా బిజీగానే ఉంటాయి కదా!' అనుకున్నాడు.

''ఏరా... ఇప్పుడు ఫోన్ చేశావేంటి? ఇక్కడ నేను బిజీగా ఉన్నాను. సాయంకాలం నేనే ఫోన్ చేస్తాను'' ముక్కంటి కట్ చేసేలోపే...

''ఒరే బాబూ, కాస్త ఆగరా... ఒకే ఒక నిమిషం టైమివ్వు నీ బిజీ ఎప్పుడూ ఉండేదేగా...'' గాభరాగా అన్నాడు రాంబాబు.

''ఏంటో చెప్పు ఇవతల పార్టీ ఒకరికి సైట్ చూపిస్తున్నాను. మధ్యలో అంతరాయం కలిగితే ఇబ్బందిగా ఫీలవుతారు''.

''ఓ. కే'' అని విషయం చెప్పాడు రాంబాబు.

''శుభ్రంగా ఓ యోగా ఇన్‌స్టిట్యూట్ పెట్టుకో ఈ జైలు, ఖైదీలు అంతా నాన్సెన్స్, వేస్ట్‌వర్క్.....'' ముక్కంటి మాటలు రాంబాబులోని కోపాన్ని నషాళానికంటించాయి. 'అయినా... కాలాన్ని డబ్బులో కొలిచే వాడికి సంఘసేవ గురించి ఏం తెలుస్తుందిలే' అని తనను తాను సముదాయించుకున్నాడు. తన నిర్ణయంలో మార్పు లేదని, చేతనైతే సహాయం చేయమని ఫోన్ కట్ చేశాడు.

***

మరుసటి రోజు ఉదయం రాంబాబు ఇంటి ముందు చక్కటి దీర్ఘచతురస్రాకార 'ఫ్లాట్' ఆకారంలోని కారు ఆగింది. అందులోంచి ఠీవిగా దిగాడు ముక్కంటి.

పేపర్ చదువుతూ కాఫీ తాగుతున్న రాంబాబుకు కారు ఆగిన శబ్దం, ముక్కంటి అడుగుల చప్పుడు వినిపించాయి. కానీ, ప్రతిస్పందించ దలుచుకోలేదు. ముక్కంటి పక్కన వచ్చి నిలబడ్డా చూడనట్లే అక్షరాల్ని తింటూ కాఫీ తాగసాగాడు.

స్నేహితుడు మాట్లాడకపోవడాన్ని ముక్కంటి సహించలేడు. చిన్నప్పట్నించీ అతడికున్న ఆ బలహీనత తెలుసుకావున, అదే అస్త్రాన్ని ప్రయోగించాడు రాంబాబు.

ముక్కంటికి జుట్టు పీక్కోవాలనిపిస్తోంది. తనను తాను స్థిమితపరచుకుని, ''నీ ఆలోచనలను సవరించాలనుకోవడం, కొత్త ప్రతిపాదనలు చేయడం తప్పయి పోయిందిరా....నువ్వు మాట్లాడకుంటే నేను తట్టుకోలేను. నువ్వు కోరినట్లుగానే ఏర్పాట్లు చేశాను. అలక వీడరా బాబూ...'' దీనంగా అడిగాడు.

రాంబాబు కాస్త ప్రసన్నుడయ్యాడు. తల తిప్పకుండా కేవలం కళ్ళు మాత్రమే ముక్కంటి వైపు తిప్పి, ''నిజంగానేనా?'' అన్నాడు.

''నిజంరా... నా రియల్ ఎస్టేట్ బిజినెస్ మీద ఒట్టు!''


''నీ బిజినెస్ ఎవడికి కావాలోయ్...మన స్నేహం మీద ఒట్టు పెట్టు అప్పుడే నమ్ముతాను...''

''అయితే మన ముప్పయ్యేళ్ళ స్నేహంపై ఒట్టు. జైల్లో నీకు అనుమతి సంపాదించాను. చక్కగా ఖైదీలందరితో యోగాసనాలు వేయించొచ్చు. అది చెప్పేందుకే ఇక్కడి కొచ్చింది.''

ముక్కంటి స్నేహ బంధంపైగల అవ్యాజమైన ప్రేమ రాంబాబుకు తెలుసు. అందుకే స్నేహంపై ఒట్టు వేశాక అతని మాటలు నమ్మాడు. అప్పటి వరకూ నిలబెట్టి మాట్లాడించినందుకు క్షమాపణలు కోరి కూర్చోమన్నాడు.

ముక్కంటికి గుండెలపై భారం దిగినట్లైంది. లక్షల రూపాయల బిజినెస్ చేసినా రాని రిలీఫ్ ఇప్పుడు వచ్చింది.

గజిని కాఫీ తెచ్చింది. క్షేమసమాచారాలు అడిగాడు ముక్కంటి. ''అడిగిన వెంటనే అపరిచితులందరికీ అన్నీ చెప్పేస్తారా?'' అంటూ విసవిసా వెళ్ళిందావిడ.




ముక్కంటి చేతిలోని కాపీకప్పు వణికింది. ''తాను అపరిచితుడేంటి?'' ఖంగుతిన్నాడు. రాంబాబు వైపు దీనంగా చూశాడు. ''తనకు పదినిమిషాల క్రిందటి విషయాలు మాత్రమే గుర్తుంటాయని నీకు తెలుసుగదా! కాకుంటే, నీవొచ్చిన ప్రతిసారీ నిన్ను నేను గుర్తుచేసేవాడిని. దాంతో మామూలుగా పలుకరించేది. ఈ సారి నేను గుర్తుచేయలేదు కదా!'' రాంబాబు వివరణతో కాఫీ పొలమారింది.

''సరి, సరి'' అనుకుంటూ కాఫీ మొత్తం తాగేశాక, ''త్వరగా రెడీ అవ్వు. నాకు చాలా పనులున్నాయి... జైలర్ గారిని పరిచయంచేసి నేను వెళ్ళాలి.''

తొందర పెట్టాడు ముక్కంటి. రాంబాబు అత్యంత వేగంగా తయారై కార్లో కూర్చున్నాడు.

కారు సెంట్రల్ జైల్ ఆవరణలో ఆగింది. ఇద్దరూ జైలర్ గదిలోకి వెళ్ళారు. ఆరడగుల నల్లటి భారీ కాయం, గుబురు మీసాల వ్యక్తి జైలర్ సీట్లో ఉన్నాడు.

''హలో...వెల్‌కం ముక్కంటి..'' అంటూ కుర్చీలు చూపాడు.

''ఏం సార్... ఎలా ఉన్నారు?'' ముక్కంటి మాటలు పూర్తి కాకుండానే, ''నీ లాగ మాత్రం కాదులే... నీకేం, నీ యవ్వారం మూడు ఫ్లాట్లు, ఆరు రిజిస్ట్రేషన్లుగా జోరుగా ఉంది కదా!'' ఫెళ్లున నవ్వాడు జైలర్ షాడో. మంచుమేఘం సుడిగాలిలా

వచ్చి ఎదుటి వాళ్ళ మొహాల్ని తాకింది.

ఇద్దరు మిత్రులూ కర్చీఫ్‌లతో తుడుచుకున్నారు.

"సార్... ఇతను రాంబాబని... ముక్కంటి మాటలు ఏ మాత్రం పట్టించుకోక, "మొన్నో ఫ్లాట్ చాలా తక్కువకమ్మాను. అమ్మిన నెలకే కొన్నతను దాన్ని డబుల్ కమ్మాడట! చాలా లాసయ్యాను. నీవు బిజినెస్ చేసే ఏరియాలో మంచి సైట్ చూపించు... నా కోసం రేటు తగ్గించొద్దులే..."

మళ్ళీ భళ్లున నవ్వు...ఖర్చీఫ్‌లకు పని బడింది మళ్ళీ.

"అలాగే సార్...సార్, ఇతనే ఖైదీలకు ఉచిత యోగా క్లాసులు.." ముక్కంటి మాటల్ని మళ్లీ అడ్డంగా నరికేస్తూ, "నువ్వు సజెస్ట్ చేసే ఫ్లాటు ఊహించని రేటుకు నేను అమ్మగలిగితే నీకు బోనస్ కూడా ఇస్తాను. నిన్ననే అమ్మాడు... అతను కలలో కూడా ఊహించని ధర వచ్చింది. అలా బాక్సాఫీస్ బద్దలయ్యేలా ఉండాలి."

> **పిడుగుకు లైటనింగ్ కండక్టర్‌లా.. రెప్పపాటు వేగంతో సంచీలోంచి తీసిన టవల్‌ను ముఖానికి అడ్డు పెట్టుకున్నాడు రాంబాబు. తృటిలో ఉప్పెన నించి తప్పుకున్నాడు.**

మళ్ళీ నవ్వు...ఖర్చీఫ్‌ల సామర్థ్యం వంద శాతం అయిపోయింది. ఇద్దరూ చొక్కాలెత్తి తుడుచుకున్నారు.

ఈ సారి ముక్కంటి మాట్లాడకముందే, "ఇతనెవరు?" అడిగాడు షాడో. రియల్ ఎస్టేట్ ఫోబియా నుంచి బయటపడ్డాడని నమ్మాక, "సార్... ఇతనే రాంబాబు..." అంటూ అంతా చెప్పి పరిచయం చేశాడు.

"నైస్‌టూ మీట్ యు మిస్టర్ రాంబాబు" అంటూ ముఖాన్ని దగ్గరికి చేర్చి ఫెళ్ళున నవ్వాడు షాడో. నవ్వాలో, ఏడ్వాలో తెలియని పరిస్థితి! ఈ సారి తుడుచుకునేందుకు ఏమీలేదు.

"ప్రతి శని, ఆదివారాలు నువ్వు రావచ్చు. ఖైదీలకు ఇంత ఉపకారం చేస్తానంటే మేమెందుకు అడ్డు చెబుతాం. కానీ, ఖైదీల్లో రకరకాల వాళ్ళుంటారు... జాగ్రత్తగా ఉండాలి" నవ్వకుండా కూల్‌గా చెప్పాడు షాడో.

"ఓకే సర్...చాలా థాంక్యూ... ఓ మంచి పనికి నాకు అవకాశం కల్పిస్తున్నందుకు మీకెలా ధన్యవాదాలు చెప్పాలో తెలియట్లేదు." లక్ష్యానికి మార్గం సుగమం అయిందన్న సంతోషంతో ఉన్నాడు రాంబాబు...

"ధన్యవాదాలదేముంది... ముక్కంటి ఓ మంచి ఫ్లాట్ చూపిస్తే సరిపోయింది." నవ్వబోయే సంజ్ఞలు బయటపడడంతో... వెనకనించి ఎవరో పిలిచినట్లు ఇద్దరు మిత్రులు కూర్చునే తల వెనక్కి తిప్పారు.నవ్వు రిలీజైన కాసేపటికే తలస్నానం చేసినట్లైంది. సెలవు తీసుకుని జైల్లోంచి బయటపడ్డారు.

***

ఆ రోజు శనివారం. రాంబాబు మొదటిసారి ఖైదీలకు క్లాస్ తీసుకునేందుకు, చంకలో సంచీతోబయలుదేరాడు. రెండు సిటీ బస్సులు, ఓ ఆటో మారాక జైలు ఆవరణకు చేరుకున్నాడు. లోపలికి వెళ్ళగానే షాడో ఎదురయ్యాడు. రాంబాబు సంచీని ఓ సారి తడిమి చూసుకున్నాడు.

"గుడ్ మిస్టర్ రాంబాబు... చెప్పిన సమయానికి వచ్చారు. పదండి ఖైదీలను పరిచయం చేస్తాను" అని షాడో లోపలికి దారి తీశాడు.

రాంబాబు సంచీని జాగ్రత్తగా పట్టుకుని లోపలికి అడుగేశాడు. జైలు వార్డెన్లు ఖైదీలను ఆరు బయట కూర్చోబెట్టారు.

షాడో ఓ హ్యాండ్ మైక్ తీసుకుని, "ఖైదీలందరూ వినండి ఆయన రాంబాబు. మీ మీద ప్రేమతో మీలో మార్పు తీసుకురావాలని... యోగా, ధ్యానం నేర్పేందుకు వచ్చారు. మారితే త్వరలోనే విముక్తి కలుగుతుంది". అంటూ మైక్‌ను రాంబాబుకిచ్చి పరిచయ వాక్యాలు చెప్పమన్నాడు.

"మిత్రులారా.... తెలిసో తెలియకో తప్పు చేసి జైలు కొచ్చారు. మీలో మార్పు కలిగి మంచి వారుగా మారాలి. విడుదలయ్యాక కొత్త జీవితం ప్రారంభించాలి. అందుకు నాకు చేతనైన సహాయం చేయాలనే ఇక్కడికొచ్చాను" అని రాంబాబు ముగించాడు.

"ఓ. కే.... ఈదెబ్బతో మా జైలు బీహార్ జైలు లాగా పాపులర్ కావాలి సుమా! నన్ను 'మేల్ కిరణ్ బేడి అనాలి' షాడో నోరు భళ్ళుమంది.

పిడుగుకు లైటనింగ్ కండక్టర్‌లా.. రెప్పపాటు వేగంతో సంచీలోంచి తీసిన టవల్‌ను ముఖానికి అడ్డు పెట్టుకున్నాడు రాంబాబు. తృటిలో ఉప్పెన నించి తప్పుకున్నాడు.

షాడో వెళ్ళాక ఖైదీలను పరిచయం చేసుకున్నాడు. వారిలో జైల్లో కూడా తెల్లచొక్కా, తెల్లలుంగీతో ఉన్న ఫ్యాక్షనిస్ట్ వసంతరాయుడు, రివటలా ఉన్న ప్రముఖ గజదొంగ విక్టర్, 'శతబలత్కారి' బిరుదు పొంది సహస్ర బలత్కారాల వైపు దూసుకెళుతూ పట్టుబడ్డ రేపిస్ట్ నారాయణ, చూపుడు వేలు-మధ్య వేళ్ళను కలిపి కత్తెరగా వాడేసే పిక్‌పాకెటర్ శోభన్, భూమి మీద నూకలు ఉండబట్టి ఎన్‌కౌంటర్‌లో బతికి బట్టకట్టిన నక్సలైట్ అయిలన్న, ఏ నేరం చేయకున్నా యావజ్జీవ శిక్ష అనుభవిస్తోన్న శాంతారావు.... ఇలా ఎందరో!

పరిచయాలు వింటున్నంతసేపూ రాంబాబు మనసు అతి దీనంగా మూలిగింది. 'తెలిసో తెలియకో' తప్పు చేస్తే పంజరంలో చిలుకల్లా బంధించి ఉంచడమా! ప్రభుత్వం ఎంత కఠినమైనది! స్వేచ్ఛ కావాలని గట్టిగా అరుద్దామనుకున్నా పరిస్థితులు వికటిస్తాయని నిగ్రహించుకున్నాడు.

తన యోగాసానాలు, ధ్యానం ప్రారంభించాడు. మొదట్లో కాస్త ఇబ్బందిగా ఫీలైనా రాను రాను ఖైదీలందరూ చక్కగా చేస్తున్నారు. క్లాస్ జరిగిన ప్రతిసారీ ఒక ఖైదీ చెవిలో ఓ నిత్యసత్యాన్ని చెప్పేవాడు రాంబాబు. అలా రహస్యంగా చెప్పినందువల్ల మిగతా వారిలో ఆసక్తి కలిగి... ఆ ఖైదీని అడిగి...చర్చ మొదలై కొంత మందైనా ఆచరణలో పెడతారనేది అతని వాదన.

ఖైదీల్లో వారివారి స్వభావాలకు, పూర్వ వృత్తులకు తగట్టుగానే అనుమానాలు వచ్చేవి. శరీరాన్ని 'బుల్లెట్‌ప్రూఫ్' చేసే ఆసనం చెప్పమని వసంతరాయుడు, దొంగతనం చేసి ఇంట్లో వారందరినీ మైకంలో ముంచేందుకు ప్రత్యేక ధ్యానం చెప్పమని విక్టర్, 'వశీకరణ ఆసనం' కోసం నారాయణ, 'సూక్ష్మ దృష్టి' ని పెంచే ప్రక్రియల కోసం శోభన్, చీమ చిటుక్కుమన్నా మెలకువ వచ్చే 'యోగనిద్ర' కోసం అయిలన్న, కుటుంబ సభ్యుల దీనవదనాల స్మృతులను చెరిపేందుకు చిట్కాలడిగే శాంతరావు....

ఇలా అందరూ రాంబాబును తమ అనుమానాలతో చుట్టు ముట్టేవారు. అతను వారి సమస్యను 'సానుభూతి' తో విని తోచిన పరిష్కారాలు చెప్పేవాడు.

మొత్తం మీద ఓ నాలుగైదు నెలలు కష్టపడి కోర్స్ కంప్లీట్ చేశాడు. చివరి రోజు...రాంబాబుకు అభినందన మరియు వీడ్కోలు సభ! పోలీస్ ఉన్నతాధికారులు ఒకరిద్దరు వచ్చారు. సభ ప్రారంభమైంది. అందరూ రాంబాబును పొగడ్తలతో ముంచేశారు. ఇక తన వంతు వచ్చింది.

"ఇందులో నా గొప్పతనమేమీ లేదు. షాడో గారి ఉదారత్వం ఖైదీల క్రమశిక్షణ నా శిక్షణకు బలాన్నిచ్చాయి. కొద్దిగానైనా మార్పు తేగలిగానని నమ్ముతున్నాను. ఇప్పుడు ఖైదీలు నేర్చుకున్న అంశాల్లో కొన్ని ప్రదర్శిస్తారు. దీంతో కార్యక్రమానికి నిండుతనం చేకూరుతుంది" అని సూచనలిచ్చి అందరినీ వరుసల్లో కూర్చో బెట్టాడు.

యోగాసానాలు, ధ్యానం అద్భుతంగా ప్రదర్శించారు వాళ్ళు. చప్పట్లు మిన్నంటాయి. యథాప్రకారం 'ఓ మంచి మాట' చెప్పేందుకు వసంతరాయుడిని ఎంచుకున్నాడు రాంబాబు. ప్రదర్శన పూర్తయ్యింది. శాలువా, పూలదండలతో సన్మానం జరిగింది. ముక్కంటి రాకపోవడం రాంబాబుకు వెలితిగా ఉంది. డబ్బు యావలో పడి అన్నీ మర్చిపోతున్నాడనుకున్నాడు. ఎంతో సంతోషంతో ఖైదీల టాటాలతో, షాడో చిరుజల్లులతో వీడ్కోలు తీసుకుని ఇంటి దారి పట్టాడు. ఒళ్ళంతా పులకరింతగా ఉంది. మంచి పని చేశానన్న ఆనందం నరనరాల్లో ఉత్తేజాన్ని నింపింది.

***

అర్ధరాత్రి రెండుగంటలు.

అదమరిచి నిద్రపోతున్నాడు రాంబాబు. దేశంలోని ఖైదీలందరికీ యోగా నేర్పినట్లు సన్మానాల మీద సన్మానాలు జరిగిపోతున్నట్లు కలలో సెవెన్టీ ఎమ్. ఎమ్ రీళ్లు తిరుగుతున్నాయి.

కాలింగ్ బెల్ మోగింది. ఉలిక్కిపడి లేచిన రాంబాబు టైమ్ చూశాడు. ముక్కంటి అభినందించడానికి వచ్చాడేమోనని తలుపు తీశాడు. ఎదురుగా నలుగురు ఆజానుబాహులు ఖాకీదుస్తుల్లో ఉన్నారు. చూడగానే పోలీసులని అర్థమవుతున్నా ఎందుకొచ్చారో అంతుబట్టలేదు.

"నన్ను అభినందించాలంటే ఇదా సమయం... రేపు రండి" తలుపులు మూయబోయాడు.

"ఒక్కక్షణం ఆగండి. మా పెద్ద దొరగారు కార్యక్రమానికి హాజరు కాలేకపోయారు. మీ గొప్పతనం విని సన్మానం చేసేందుకు పిలుచుకురమ్మన్నారు. కాదనకండి...." వినయంగా చెప్పారు వాళ్ళు.

"పిలిచి పిల్లనిస్తానంటే..." అన్న సామెత ఫ్లాషయింది. సన్మానాలు, సత్కారాలు కోరినప్పుడు రావు... వలచి వచ్చినప్పుడే అందుకోవాలని వారి వెంట వెళ్ళి జీపెక్కాడు రాంబాబు.

జీప్ నేరుగా సెంట్రల్ జైల్ దగ్గరి కెళ్ళింది. లోపలికి వెళ్ళగానే నున్నగా షేవ్ చేసుకుని హిందీ సినిమా విలన్‌లా ఉన్న వ్యక్తి జైలర్ సీట్లో కూర్చుని ఉన్నాడు. పక్కనే వినయంగా చేతులు కట్టుకుని ఉన్నాడు షాడో.

''ఏం బ్రదర్...నీకు సన్మానం చేయాలను కుంటున్నాం'' స్మూత్‌గా పలికింది అధికారి గొంతు.

''ఏదో మీ అభిమానం. లేకుంటే ఈ అర్ధరాత్రి పిలిపిస్తారా!'' సన్మానం అన గానే రాంబాబు ఒంట్లో ఏదో పులకరింత.

''మా దగ్గర రకరకాల సన్మానాలు న్నాయి. ఏది కావాలో కోరుకో''

''అయ్యో, సెలక్షన్ కూడా నాదేనా! ఇంత స్వేచ్ఛా సన్మానాలు కూడా ఉంటాయా? ఏమైనా పోలీసుల తీరే వేరు''. కాసేపు ఆలోచించి అవేంటో చెప్ప మన్నాడు.

షాడో మొదలు పెట్టాడు.

''మొదటిది: ఎం. సి. హెచ్. వీధి కుక్కల వ్యాన్‌లో వాటితోపాటు 24 గంటలు సహజీవనం చేయడం''

''రెండవది: ఆలివ్‌గ్రీన్ దుస్తులేసు కుని, గన్ తగిలించుకుని విప్లవ ప్రసంగం చేసి...మేం తుపాకుల్తో గురిపెట్టినా లెక్క చేయకుండా పారిపోవడం''

''మూడవది: మా దొరగార్ల ఇళ్ళల్లో రోజుకో ఇంటి చొప్పున అంట్లు తోమి బట్ట లుతకడం''

''.....చెప్పు, ఇంకా కావాలా?'' షాడో ఆపాడు. అంతా అయోమయం. 'ఇవేం సన్మానాలు?' ఆ మాట పైకనేశాడు.

''అవును సన్మానాలే....కాకుంటే వీటిని మీరు టార్చర్ మెథడ్స్ అని పిలుస్తుండవ చ్చు'' హిందీ విలన్ సమాధానం.

తనకూ వాటికీ సంబంధం ఎలా కుదురు తుందో అర్థం కాలేదు రాంబాబుకు. ఎక్కడో తేడా వచ్చిందనిపించింది.

''నీతో మాకు మొహమాటాలేంటి? డైరెక్ట్‌గా విషయానికొస్తాను. మర్యాదగా చెప్పు...వసంత రాయుడు ఎక్కడున్నాడు?'' విలన్ కాస్త కరుగ్గా అడిగాడు.

''వసంతరాయుడా! ఈ పేరు ఎక్కడో విన్న ట్లుందే'' రాంబాబు సందిగ్ధం చూసి ''వినడం కాదు మిస్టర్... ఈ రోజు వరకూ అతను నీకు యోగా శిష్యుడు. కరుడుగట్టిన ఖైదీలను సంస్కరి స్తానని బూటకపు మాటలు చెప్పి... ఈ దేశంలోనే పెద్ద ఫ్యాక్షనిస్ట్, వందమందిని ఫైగా ఒంటి చేత్తో చంపిన వసంతరాయుడిని జైల్లోంచి తప్పించుకు నేలా చేస్తావా! ఇరవై నాలుగు గంట్లో వాడు మాకు దొరక్కపోతే నువ్వు శాశ్వతంగా ఈ జైల్లోనే సుఖాసనం వేయాల్సుంటుంది.'' విలన్ మరీరెచ్చి పోయాడు.

''సార్...అతను తప్పించుకోడానికి, నాకూ సంబంధమే లేదు. అతను ఫ్యాక్షనిస్ట్ అనే మాట విన డమే తప్ప ఇంకేమీతెలియదు, నన్ను నమ్మండి.''

''ఎలా నమ్ముతాం...సన్మానానికి ముందు జరిగిన డెమోక్లాస్‌లో వసంతరాయుడి చెవిలో చెప్పింది ఖచ్చితంగా తప్పించుకునే ఉపాయమే కదా! ఇంత కంటే బుజువేం కావాలి?''

''ప్రతిసారి క్లాస్ తీసుకున్నప్పుడల్లా ఒకరి చెవిలో నిత్యసత్యాలను, సామెతలను చెప్పడం శిక్షణలో భాగం సార్. ఈ విషయం షాడోగారికి కూడా తెలుసు'' అని దీనంగా షాడో వైపు చూశాడు రాంబాబు.

## స్విమ్మింగ్‌పూల్



ఈ జీవితాన్నిచ్చింది ఎందుకనుకుంటు న్నారు.. చక్కగా అనుభవించడానికే. మనీ ఎర్నింగ్ అనేది ఎప్పుడైనా చేయచ్చు.. అంటూ చెబుతోన్న సమీరారెడ్డి ముంబయ్‌లో ఓ సొంత ఇల్లు కట్టుకుని అందులో ఓ పెద్ద స్విమ్మింగ్ పూల్ కట్టుకోవాలని ఆశపడుతోంది. రోజూ ఉదయం ఓ గంట సేపైనా స్విమ్మింగ్ చేయందే ఒళ్ళంతా అదోలా వుంటుందట. అందుకే స్విమ్మింగ్ పూల్‌కు అవకాశమున్న ఇంటికోసం సమీరా తెగ వెతుకుతోంది. అలాంటి ఇల్లు కొన్నాక పెళ్లి చేసుకుంటారా అని అడిగితే... ఇల్లుకొనగానే పెళ్లేమిటి.. ఏం పెళ్లి కాకుండా ఇంట్లో వుండకూడదా అంటూ చెబుతోంది సమీరా. అయినా ఒళ్ళంతా అదోలా ఎందుకుం టుందీ.. పెళ్లీడుకొస్తేనే కదా అని తోటి నటీమ ణులు చెవులు కొరుక్కుంటున్నారుట.

బిగుసుకుపోయి ఉన్నాడు షాడో.

''వాడో గొట్టం...వాడి వల్లే నీకు జైల్లోకి అనుమతి లభించింది. ఈ కుట్రలో మీ ఇద్దరి హ్యాండ్స్ ఉన్నా యని నా అనుమానం'' హిందీ విలన్ బాంబు పేల్చాడు. రాంబాబుతో పాటు షాడోకు కూడా ఒళ్ళంతా చెమటలు పట్టాయి.

''ఓ.కే మిస్టర్...రేపు ఈ సమయానికల్లా వసంత రాయుడు జైల్లో ఉండాలి. అదర్‌వైజ్...నీకు సన్మానం, సుఖాసనం తప్పవు'' లేచి వెళ్ళిపోయాడు అధికారి.

వడలిపోయిన ఆకులా ఇల్లు చేరాడు రాంబాబు. గజిని ప్రశాంతంగా నిద్రపోతోంది. తనకు దూర మవుతానేమోనన్న బాధ మెలిపొట్టడంతో కన్నీళ్లు వరదలా ఉప్పొంగాయి.

ఆ రాత్రి నిద్రపట్టలేదు. ఉదయానికల్లా షాడో నుంచి ముక్కంటికి అతని నుంచి ఇతర స్నేహితులకు, రాంబాబు బంధువులకు విషయం తెలిసింది. కొందరు సానుభూతి తెలిపితే, 'పోలీసులతో యావారం అలాగే ఉంటుందని' మరికొందరు ఎత్తిపొడిచారు.

ఆ రోజంతా మాటల తూటాలతో రాంబాబు మనసు చిల్లులు పడింది. పుణ్యా నికి పోతే పాపం ఎదురవ్వడం అనుభవంలో కొచ్చింది. చీకటి పడడం మొదలవగానే దడ మొదలైంది. అర్ధరాత్రి రెండు కాగానే పిలుచు కెళ్ళారు పోలీసులు. హిందీ విలన్ మొహంలో ఏదో అసంతృప్తి, అసహనం. షాడో గ్రానైట్ రాయిలా ఉన్నాడు.

''నీతో మాటలు అనవసరం. సన్మానం, సుఖాసనం తప్పవు'' అంటూ సెల్‌లోకి తీసుకె ళ్ళమని సైగ చేశాడు విలన్. వాళ్ళు రాంబాబు చంకల క్రింద లాఠీలు వేసే లోపే... ఉరి ఆపేందుకు గవర్నర్ క్షమాభి క్షతో వచ్చినట్లు, ఓ కానిస్టేబుల్ పరుగు పరు గున వచ్చి 'ఢఢ్' మంటూ సెల్యూట్ కొట్టాడు.

''సార్... వసంతరాయుడు తిరిగొచ్చాడు'' సంతోషంగా చెప్పాడు. వెనకాలే ఇద్దరు పోలీసులు వసంతరాయుడిని తీసుకొచ్చారు. ఆ దృశ్యం చూడగానే రాంబాబు, షాడోలకు యుగళ గీతం పాడాలనిపించింది. జరిగిందంతా చెప్పమన్నాడు విలన్. వసంతరాయుడు నోరు విప్పాడు.

''నా జీవితాశయం నా శత్రువు వెంకటరాయు డిని చంపడం. లేకుంటే వాడు నన్ను చంపేస్తాడు. అందుకే వాడి చావుకు ముహూర్తం పెట్టి, రాంబా బుగారి వీడ్కోలు సభ అనంతరం తప్పించుకు న్నాను. బాంబులు, కొడవళ్ళు, అనుచరులతో నేను వెళ్ళేసరికి వెంకటరాయుడు బుగ్గయి ఉన్నాడు. ఇన్నాళ్ళూ తను నా కోసం దాచిన బాంబులు పొరబాటున పేలి ప్రాణాలు పోయాయి. జైలుకు మళ్ళీ తిరిగొస్తాననుకోలేదు. రాంబాబుగారు చివరి రోజు నా చెవిలో చెప్పిన 'ఎవరు తీసిన గోతిలో వారే పడతారన్న' మాట నా చెవుల్లో మార్మోగింది. ఎన్నాళ్ళీ రాక్షస జీవితమ నిపించి తిరిగొచ్చాను.''

చీమ చిటుక్కుమన్నా వినిపించేంత నిశ్శబ్దం. వసంతరాయుడి మాటల్ని అందరూ ఆశ్చర్యంగా విన్నారు. రాంబాబుకైతే... ఆనందం కట్టలు తెంచు కుని కన్నీళ్లై పారింది. అమాంతంగా వసంతరా యుడిని కౌగిలించుకుని భోరుమన్నాడు.

''నీ మంచే నిన్ను కాపాడిందని'' రాంబాబు ముఖంలోకి తొంగిచూస్తూ ఫెళ్లున నవ్వాడు షాడో. తన్మయత్వంతో తుడుచుకోలేదు కూడా!

తను చేసిన కృషి వృథాపోలేదన్న సంతోషాన్ని ఆస్వాదిస్తూనే పోలీసులు గుర్తొచ్చి, 'వామ్మో...వా ళ్ళతో జాగ్రత్తగా ఉండాలి' అనుకుంటూ ఇంటిదారి పట్టాడు రాంబాబు.

★